# ఆత్మసంయమం

ఆత్మసంయమం గురించి నాకు బుద్ధెరిగిన నాటినుంచీ ఎవరో ఒకరు ఉపదేశిస్తూనే వచ్చారు. అబద్ధం ఎట్లా చెప్పేది ? కంచంలో కూరవేస్తే అన్నం పెట్టేలోపల కూర తినెయ్యకూడదని మా అమ్మ చేత్తోనూ నోటితోనూ కూడా చెప్పింది. బుర్రకెక్కి చావలేదు. నా తప్పే అనుకోండి. ఓ వేళ చిన్న పిల్లకి ఆత్మ సంయమ మంత పెద్ద విషయం అబ్బదేమో. ఎటుపోయి ఎటొచ్చినా మంచిదని మా అమ్మ, తప్పని తెలిసికూడా, వొట్టి కంచంలో అన్నం పెడుతూ వచ్చేది. అట్లాగా నాకు ఆత్మసంయమం అబ్బిచావక ఉత్తమెతుకులే నోట్లో వేసుకునేవాణ్ణి. ఆర్థిక దృష్టిలో ఓవేళ వొట్టి కూర తినటంకంటె వొట్టి మెతుకులు తినటం ఓ పక్షాన నయమే అయినా, ఆత్మసంయమం దృష్టిలో చేతిని, నోటిని కట్టెయ్య లేకపోవటం కూర విషయంలో ఎంతో అన్నం విషయంలోనూ అంతేగా!

ఈ సంగతే మా అమ్మకు తట్టిందో ఏమిటో మరి. ఆవిడమటుకు తన అను మతి పొందకుండా నేను నోట్లో ఏమీ పెట్టుకోరాదనీ, అట్లా పెట్టుకోవడం పెద్ద మనిషి లక్షణంకాదనీ, నలుగురిమధ్యా తినేటప్పుడు ఈవిధంగా నడుచుకున్నట్టయితే నన్ను కాస్త ఇదిగా చూస్తారని నాకు నచ్చచెప్పింది. నాకా యీడున ఆత్మసంయమం గురించి తెలియకపోతే తెలీదేమోగాని పెద్దమనిషితనానికి రోషంవచ్చినా నన్ను నలుగురూ ఇదిగా చూసినా ఒప్పుకోవటానికి సంసిద్ధుణ్ణికాని కారణంచేత కంచంలో వడ్డించిన పదార్థాలు వడ్డించినట్టే నోట్లో వేసుకునే అలవాటు మానుకున్నాను. అయినా నా ఆత్మసంయమం పూర్తి అయిందనుకోవటానికి వీల్లేదు. ఎందుచేతనంటే నా నోరు కట్టుపడినా చెయ్యిమటుకు కట్టుబడి చావక కంచంలో వేసిన కూరగావి పచ్చడిగాని వేలుతో పొడవటమూ, అన్నంలో బియ్యపుగింజల కోసమూ, రాళ్ళు ఏరటమూ మొదలైన పనులుచేస్తూ ఉండేవాణ్ణి.

ఇంతా శ్రమపడి మా అమ్మ నేర్పిన ఆత్మసంయమం దక్కలేదని చెప్ప టానికి నాకెంతో విచారంగా ఉంది. మా అమ్మ చెప్పిన పాఠాలు నేను పెద్దయినాక ఆచరణలో పెట్టలేదు. మరీ నిగ్రహపరులైన వాళ్ళమధ్య భోజనానికి కూచున్నప్పుడు వాళ్ళనుచూసి సిగ్గుపడి చేతినీ నోటినీ కట్టేసుకుంటానే గాని మామూలు మానవ మాత్రుల సమక్షంలో అన్నం ముందర ఆత్మసంయమం అంటే పాటించను.

మా అమ్మేకాదు, నా చిన్నతనం నాకు చాలా మంది పెద్దలు ఆత్మ సంయమం నేర్పటానికి ప్రయత్నించి విఫలులైనారు. చేతిలో రెండణాల డబ్బులు

కన్పించినప్పుడల్లా కాఫీ హోటల్లో తినవద్దని, సినిమాలూ దిబ్బలూ చూడవద్దనీ నాకు పెద్దలు చాలా ప్రభోదం చేశారు. ఈ విధంగా నేనే నా మొదటి పదిహేను సంవత్సరాల వయస్సులోనూ తగలేసినడబ్బు దాదాపు ఓ పాతిక రూపాయలుంటుం దనే ఆర్థిక విషయం అట్లా ఉంచి నాకు కాఫీ హోటలూ, సినిమా నాటకాదులూ వ్యసనం అయిపోవటం గురించి పెద్దలు చాలా గట్టిగా చెప్పారు. ఎనభై ఏళ్ళ మా తాత తను పుట్టి పెరిగిన అరవైయేళ్ళదాకా సినిమా అనేది చూసిఎరగడని విన్నప్పుడాయన ఆత్మసంయమంచూసి నేను చాలా సిగ్గుపడ్డాను. పూర్వకాలం వాళ్ళ ఆత్మసంయమం గురించి వింటుంటే నాకు నేనెంత పాతకుణ్ణో తెలివొచ్చింది. చిన్నతనంలో నేనెరిగిన ముసలాళ్లలో నలభై ఏళ్లదాకా రైలెక్కని వాళ్లు, జన్మలో ఎన్నడూ, ఊరికే చూసే కూచిపూడి భాగోతాలూ, హరికథలూ, తోలుబొమ్మలూ, జంగం కథలూ తప్ప, కానీ ఖర్చుచేసి నాటకాలు చూడనివాళ్ళూ ఉన్నారు. వెధవది, డబ్బు ఖర్చు మాటకాదు; కాని అక్కడ ఆత్మసంయమం ప్రధాన విషయం. ఘంచిగోష్ఠి ఎవరూ కాదనరు. నేనెరిగిన ఓ ముసలాయన మా ఊళ్లో వెంకటనారాయణగార్ని భాగోతం[1] పాతిక ప్రదర్శనాలు చూశాడు. అవును మరి. భాగోతం చూడటం పుణ్యం! అట్లాగే మా తాతయ్య కూడా డెబ్బై ఆరోఏట శ్రీరామజననం[2], శ్రీకృష్ణజననం, కాళీయమర్దన[3], అహి మహి[4], లంకాదహనం[5] మొదలైన పుణ్య సినిమాలు వరసనచూశాడు. దానికేం? నేను సినిమా కోసం తాపత్రయపడ్డానంటే శాకందులో పుణ్యం గురించి తెలిసికాదుగా — ఏదో సరదాగా ఉంటుందని : పాయె ఆత్మసంయమం ..

నాకీ ఆత్మసంయమం ఎందుకంటలేదు భగవద్గీత చదివితే అర్థమయింది. భగవద్గీతలో కూడా ఆత్మసంయమం గురించి ఉంది. "బుద్ధీంద్రియాణి సంయమ్య"[6]

---

1. వెంకట నారాయణగారి భాగోతం... .
2. శ్రీరామ జననం : దాదాసాహెబ్ ఫాల్కే తీసిన మూకీ చిత్రం.
3. కాళీయ మర్దన : దాదాసాహెబ్ ఫాల్కే తీసిన మూకీ చిత్రం.
4. అహి మహి : దాదాసాహెబ్ తీసిన మూకీ చిత్రం.
5. లంకాదహనం : దాదాసాహెబ్ తీసిన మూకీ చిత్రం. ఇంకొక రాదా పిలిం కంపెనీ సంస్థ కాళ్లకూరి దర్శకత్వంలో మరొక టాకీ ఈ పేరుతో 1936 లో వచ్చింది. ఇందులో నటేశన్ అంజనేయ పాత్రదారి.
6. బుద్ధీంద్రియాణి సంయమ్య : "భగవద్గీతలోని మూడవ అధ్యాయం 6 వ శ్లోకం "కర్మేంద్రియాణి సంయమ్యయ ఆస్తే మనసా స్మరన్ ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే." ఏదో చదివినట్లు గుర్తు అని ఎదపడన్నాడు కాబట్టి కర్మస్థానంలో బుద్ధి పొరపాటని సర్దుకోవచ్చు.

ఇనో ఏదో మరి చదివినట్టు గుర్తు. ఏమైనా భగవద్గీతలో చెప్పబడిన హంశాలు మనబోటిగాళ్లకి కాదని మా పెద్దత్తయ్య మొగుడు గట్టిగా చెప్పేవాడు. ఒకసారి ఆయన అస్పృశ్యతను సమర్థించి మహాత్ముణ్ణి తిడుతుంటే "ఇదేమిటి, మామయ్యా, కుక్కనూ చండాలుణ్ణి ఒకటిగానే పండితులు చూస్తారని భగవద్గీతలో ఉందిగామాలు గదా!" అని నేనంటే, "భగవద్గీతలో ఉన్నదంతా మనం చేసి యీడవగలమట్రా, నాయనా." అన్నాడాయన. దాన్నిబట్టి నాకేమనిపించిందంటే, నాకన్న పెద్దలైన వాళ్లు చెప్పబట్టేకదా నాకు ఇంద్రియ సంయమమూ, బుద్ధిసంయమమూ అంటకుండా పోయింది అనుకున్నా.

అటుపిమ్మట కూడా "పెళ్లామంటే ఆపేక్షగా ఉండకురా, బాబూ," "అత్తవారిమీద ఆడపాదడపా అలుగుతూ ఉండరా, నాయనా," "కనపడ్డ నిర్భాగ్యుని చేతిలోనూ కానీ డబ్బులు వెయ్యకురా తండ్రీ" అంటూ చెప్పారనుకోండి. అవి నా బుర్రకెక్కలేదు. (వెధవది కానీ డబ్బు అడుక్కునేవాడి చేతిలో పెడితే ఇంతలో దివాలా తీస్తామని కాదనుకోండి; అటువంటి ఆనందాని కలవాటు పడితే అది వొదిలించుకోవటం మళ్లీ మన సాధ్యంకాదు గదా అని!).

జీవితం ఎంత విచిత్రంగా ఉంటుందనటానికింతకన్న తార్కాణం ఏం కావాలి? నాకిక సంయమం కుదరదని నేనూ నా పెద్దలూ ఏకగ్రీవంగా రూఢి చేసుకున్న తరవాత అకస్మాత్తుగా తలవని తలంపుగా, నాకా తారక మంత్రం పట్టుపడింది. నాకివాళ ఆత్మ సంయమం కుదరటమే కాక దాన్ని అభ్యసించేటందుకు శాస్త్రీయమైన మార్గం కూడా దొరికింది.

ఈ తారకం నా కందించినవాడు నా స్నేహితుడు. నాతో కలిసి మా ఆఫీసులో పనిచేసే శేషాద్రి.

మా ఆఫీసులో అందరమూ గాలికెగిరే పుల్లాకుల మోస్తరుగా యుద్ధ విషయాలు[1] చర్చిస్తూ జర్మనీ గెలిచినట్టు కనపడ్డప్పుడు వార్తల్ని నమ్ముతూ, ఓడిపోతున్నట్టు వార్తలు వచ్చినప్పుడు వార్తల్లో ఉండే అసత్యాన్ని గ్రహిస్తూ కిందూ మీదూ అవుతూ ఉండే వాళ్ళం. బెంగాలులో కరువొచ్చిందంటే[2] ఇక అక్కడ విప్లవం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసేవాళ్ళం. వెధవది కడుపులో చల్ల కదలకుండా కూర్చున్నవాళ్ళం దేశానికి విముక్తి తీసుకురాలేక పోవటమంటూ కలగటం సహజమేమో కాని ఎట్లాగూ తిండికిమాడి చచ్చేవాళ్ళు ఊరికే చావటం దేనికి, నిక్షేపంగా స్వాతంత్ర్యంకోసం చావక అని మాలో కొందరికి బాధగా ఉండేది.

కాని మా శేషాద్రిమటుకు ఈ చర్చలకు చలించేవాడు కాదు. ఎంతో నిర్లిప్తతల్లే ఉండేవాడు. ఒకసారి నాకు వాడి వాలకం చూసి మరీ ఆశ్చర్యంవేసి,

---

1. రెండవ ప్రపంచ యుద్ధ విషయాలు.
2. బెంగాలు కరువు : అరు[illegible] ప్రస్తావన గమనించండి.

''ఏమిటోయ్ నీ అభిప్రాయం బెంగాలు ఫామిన్ రిలీఫుకు చందాలు వేస్తున్నారు. వెయ్యటం మంచిదంటావా? వెధవది. డబ్బుకొక్కొదనుకో. ఈ డబ్బిచ్చి మనం మంచి చక్కని విప్లవాన్ని కాస్తా పాపం చేసినవాళ్ళ మవుతామేమో, భారత స్వాతంత్ర్యానికి తెరచి ఉన్న ఒక్క తలుపూ మూసినవాళ్ళ మవుతామేమోనని ! ఇంతకూ నీ అభిప్రాయం ఏమిటి?" అన్నా.

శేషాద్రి నా అజ్ఞానానికి చిరునవ్వు నవ్వి, "పిచ్చివాడా, ఈ బెంగాలు క్షామమూ, భారత స్వాతంత్ర్యమూ, ఎక్కడున్నై?" అన్నాడు.

ప్రశ్న తెలివిగానే వేశాడు. బెంగాలు క్షామం బెంగాల్లోనే ఉన్నట్టు పత్రికల్లో పడింది. ఓవేళ నీ రాయలసీమకన్నా, ఏ కేరళానికన్నా వచ్చిందేమో అప్పటి కింకా తెలీలేదు. భారత స్వాతంత్ర్య మంటే దాన్ని గురించి అభిప్రాయభేదా లున్నట్టు నాకర్థ మయింది. కొందరది ఇంగ్లీషువాళ్ళ దగ్గిరుందన్నారు. మరి కొందరు అది మహాత్ముడి దగ్గిరికి ఎన్నడో వచ్చిందనీ మిగిలినవాళ్ళనే ఇంకా చేర లేదనీ అస్పష్టంగా చెప్పారు. ఈ విషయాలన్నీ పైకి అని నా రాజకీయపైన అజ్ఞానం ఎందుకు బయట పెట్టాలని నాకు తెలీసట్టు ఒప్పుకున్నా.

అయితే నేను చెబుతా పట్టు. అది మన మనస్సుల్లోనే ఉందన్నాడు శేషాద్రి. ఇది నేను వెనక విన్న సంగతి మటుకు కాదు.

నా విస్మయం కనిపెట్టి శేషాద్రి నాకు తత్వం బోధించాడు.

"ఒక్క రహస్యం చెబుతున్నా విను. అన్ని మానవసమస్యలకీ ఒకటే సూత్రం. దాన్ని ఆటోసజెషనంటా[1] రింగ్లీషువాళ్ళు. అదే ఆత్మ సంయమం." అన్నాడు శేషాద్రి. "మిమ్మల్నందర్నీ బాహ్య సమస్యలు బాధిస్తయ్. మీ మనస్సులూ బుద్ధులూ బాహ్యానికి బంధించబడి బాహ్యవిషయా లెట్లా ఆడిస్తే ఆడుతున్నై. నా మనస్సు బాహ్యాన్ని జయించింది. నాకు సృష్టి మీద ఆధిపత్యం వచ్చేసింది. బెంగాలు సమస్య నీకుంది. నాకు లేదు. భారత స్వాతంత్ర్య మంటున్నావు నువు. నే నటువంటిది లేదంటున్నాను".

"ఎందుకు లేదూ! ఉండెగా మరి"

"ఉందని నువు కనుక్కున్నావా? లేదు. నీకెవరో చెప్పారు. నువ్వెక్కడో చదివావు. ఆ చెప్పిన ముక్కా చదివిన ముక్కా నీ బుద్ధిని లొంగదీసి నిన్నాడిస్తున్నయ్. నిన్ను నువు పరీక్షించుకో నువ్వెంత దీనస్థితిలో ఉన్నదీ బోధపడుతుంది."

---

1. ఆటో సజెషన్ : వైయక్తిక బోధద్వారా, వైయక్తిక ప్రోత్సాహంద్వారా కోరిన ఫలితాన్ని ఒక వ్యక్తి సాధించే వైద్య విధానం. కు (cou'e) అనే ఆయన దీన్ని మొదట్లో వ్యాప్తికి తెచ్చారు. (Self Mastery through Conscious Autosuggestion, London, 1922).

నే నాశ్చర్యపడ్డా, శేషాద్రి నాకన్న చాలా బలంగా ఉన్నట్టు నాకు స్పష్టమయింది. నీకి బలం ఎట్లావచ్చిందన్నా.

"ఆటోసజషన్ ఇంకోళ్ళు చెప్పిన మాటలు విని దుర్బలుడనై పోతున్నావు కదా నీ మాట నువు విని బలాఢ్యుడివి కాగలవు."

"ఎట్లా?"

"బలంగా అనుకో. ప్రపంచంలో నా అంత గొప్పవాడు లేడనుకో. అన్నిటినీ జయిస్తున్నాననీ, ఏదీ నన్ను చలింపచెయ్యలేదనీ రోజూ అనుకో. ఉదయం నిద్ర లేవగానే ఓ పదిసార్లూ, నిద్రపొయ్యేముందు మరో ఓ పదిసార్లూ అనుకో. ఈ విధంగా ఓ నెలరోజులనుకో. నీలో మార్పు నీకే బోధపడుతుంది." అన్నాడు శేషాద్రి చాలా బలంగా.

నేను వెంటనే నమ్మలేకపోయినా.

"నీకో నిదర్శనం చెబుతా విను. మా చుట్టాల్లో ఓ కుర్రవాడికి జబ్బుచేసి మంచాన పడ్డాడు. దబ్బుతగలేసి ఎంతోమందిచేత మందులిప్పించారు. రోగం నయం కాలేదు సరేకదా వాడికి చచ్చిపోతాననే అధైర్యం ఏర్పడింది. ఆ స్థితిలో నేను వాడికి ఆటోసజెషన్ రహస్యంచెప్పాను. అంతే, ఇకవాడు డాక్టర్ను దగ్గిరికి రానిస్తే వొట్టూ. తనకి రోగం లేదన్నాడు. రోగం నయమయిందన్నాడు.

శేషాద్రి నాకేసి సగర్వంగా చూశాడు.

"జబ్బు నయమయిందా?" అన్నా.

"కాలేదనటానికి మనం ఎవళ్ళం?"

"లేచి తిరుగుతున్నాడా?"

"లేదు, పోయినాడు" అన్నాడు శేషాద్రి. అది మన వాదన కప్రస్తుతం అని సూచిస్తూ.

ఈ ముక్క వినగానే నేను కొంత నిరుత్సాహపడ్డమాట నిజమేగాని శేషాద్రి ప్రోద్బలం మీద నేను అతనిదగ్గిర ఉన్న పుస్తకాలు చదవటానికి ఒప్పుకున్నా. దాని క్కూడా మొదట ఒప్పుకోలా. శేషాద్రి నాకేసి తీవ్రంగా చూస్తూ, "నా దగ్గిర ఉన్న పుస్తకం చదువు. చదువు, చదువు, చదువు, చదువు, చదువు, చదువు, చదువు, చదువు." అని తీవ్రంగా అనేటప్పటికి ఎందుకనో సరేనన్నా. ఆ తరవాత తెలిసింది—వాడు తన ఆత్మశక్తి హెటరో సజషన్[1] ద్వారా నామీద ప్రయోగించాడని.

ఆ పుస్తకాలు చదివానేమో, నేను బాగుపడ్డాననుకోండి. ఇప్పుడు నా దౌర్బల్యం యావత్తూ పోయింది.

ఇదే నిజమైన ఆత్మసంయమం. అదివరలో నన్ను ఆత్మసంయమం చేసుకోమన్న వాళ్ళే గాని దానికిటుకు చెప్పినవాళ్ళులేరు. ఆ పుణ్యం శేషాద్రి కట్టుకున్నాడు.

---

1. హెటరో సజషన్ : అన్యబోధ సోత్సాహం ద్వారా అనుకున్న ఫలితాల్ని సాధించడం.

ఇదే తపస్సు. ఈ తపస్సు చేసే మునీశ్వరులు గొప్పవాళ్ళయినారు. అప్సరసలు వాళ్ళ మనస్సులను చలింపజేసి వాళ్ళ తపోభంగంచేశారు. బాహ్య ప్రపంచం తాలూకు సజెషనుకు యోగి లొంగరాదు.

నేను ప్రస్తుతం అదే అభ్యసిస్తున్నా. నా భార్య చిక్కిపోతున్నదని చెబుతారు. నాకు మతిమరుపు కలుగుతున్నదని చెబుతారు. నేను లక్ష్యం చెయ్యను. కాంగ్రెసు మిత్రులొచ్చి జిన్నాను[1] మనం ప్రోత్సహించకూడదంటారు. కమ్యూనిస్టు మిత్రులొచ్చి ప్రజాసంస్థల కైక్యత కావాలంటారు. అయితే ఏమంటాను, మా చుట్టాలొచ్చి నా స్థితిలో ఉన్నవాడు నలుగురికీ సహాయపడాలంటారు. నే వినిపించుకోను. నా సంసారం గురించీ, నా భావిని గురించీ ఎవరెవరో ఏమిటేమిటో చెబుతారు. దాంతో నాకేంపని? నాకు ఆర్థిక సమస్యలు లేవు, రాజకీయ సమస్యలు లేవు, సాంఘిక సమస్యలు లేవు. నాకు కావలసిన అన్ని ఇంద్రియ సుఖాలూ, స్వేచ్ఛలూ నా మనస్సులోనే ఉన్నై. నేను రాజాధిరాజును, దేవాది దేవుణ్ణి. నాకు చుట్టాలూ, స్నేహితులూ ఎవరూలేరు. ఎవరూ అవసరంలేదు. మనుషులంతా తుచ్ఛులే. ఎక్కడైనా ఒక పూర్వజన్మ వాసనగల మహాయోగి కనిపించి, "బాబూ ఓ రూపాయి యిప్పించండి. అదే పదివేలుగా భావిస్తాను." అంటాడు. నాకు పరమానందమవుతుంది. "అహో, ఈ బ్రష్టుడికి ఆటో సజెషన్ కిటుకు తెలియకపోబట్టికదా ఆ రూపాయి సహాయం అవసరం లేకుండా పదివేలు భావించలేకుండా ఉన్నాడు?" అనుకుంటాను. వెధవది దబ్బుచ్చాడు.

ఈమధ్య ఇట్లాగే మా బావమరిది నాతో, "బావా మా పెద్దదాన్ని మీవాడికి చేసుకో, ఇవి చేతులుకావు కాళ్లు." అని బతిమాలాడు. మావాడి ఆత్మసంయమం చూసి సంతోషించాను గాని, దానిబలం ఎంత ఉందో చూడటానికి "కట్నం ఏమిస్తావు" అన్నా. "మామూలు లాంఛనాలు తప్ప నావల్లకాదు. అవే వెయ్యినూట పదహార్లనుకో. మోటారు సైకిళ్ళనుకో." అంటూ ప్రారంభించాడు.

"అబ్బాయీ, నువు ఆటోసజెషన్ ఎరక్కపోవటం మూలంగా నా మనోశక్తి నీ విధంగా తృణీకరిస్తున్నావు. నేనో పుస్తకం ఇస్తాను. అది చదివి అభ్యసించి, అప్పుడు నా దగ్గిరికి మాట్లాడటానికిరా. మీ పెద్దదాని పెళ్ళి విషయం మాట్లాడతా." అని చెప్పి పంపించా.

కనక ఈ విషయం గురించి తీస్తే ఎంత లోతైనా ఉంది. ప్రస్తుతం మన దేశీయులంతా ఈ రాజకీయాలూ, ఈ సాహిత్యాలూ, ఈ సిద్ధాంతాలూ మానేసి ఆటో

---

1. జిన్నా : మహమ్మద్ అలీ జిన్నా (1876-78) జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన ముస్లిం నాయకుడు. పాకిస్తాన్ మొదటి గవర్నర్ జనరల్ (1947 - 1948)

సజషను అభ్యసించటం మొదలుపెడితే దేశమంతటా హెన్రీఫోర్డులూ[1], రాక్ఫెలర్లూ[2] అయిపోతారు. మన దేశంలో నలభై కోట్ల రాక్ఫెలర్లయిపోయిన తరవాత ఏ రాజకీయ సమస్యా, సాంఘిక సమస్యా ఉండదు. ఉండదు, ఉండదు, ఉండదు, ఉండదు, ఉండదు, ఉండదు, ఉండదు, ఉండదు....

—ముద్రణ : ఆంధ్రజ్యోతి (మాసపత్రిక),
నవంబరు 1945

1. హెన్రీ ఫోర్డు (1867-1947) అమెరికా సంయుక్తరాష్ట్రాలకు చెందిన ఆటో మోబైల్ ఉత్పత్తిదారుడు.

2. రాక్ఫెల్లరు : (1874-1960) అమెరికా సంయుక్తరాష్ట్రాలకు చెందిన సంపన్నుడు, ఆయిల్ మేగ్నట్ దాత.